క్లుప్తంగా

అక్కయ్యపాలెంలో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన వస్తువులు

సీతంపేట: స్థానిక అక్కయ్యపాలెం సంఘం ఆఫీస్ సమీపంలోని విఘ్నేశ్వర రెసిడెన్సీలో గురువారం అగ్ని ప్రమాదం సంభవించింది. ఫ్లాట్ నంబరు 201లో నివసిస్తున్న సర్వేందర్ కుటుంబం ఇంట్లో ఏసీ ఆన్ చేసి మరిచి పోయి విజయవాడ వెళ్లిపోయారు. ఏసీ వేడెక్కి షార్ట్ సర్క్యూట్ అవడంతో నిప్పు రవ్వలు మంచం పై పడి కాలిపోయింది. మంటలు, పొగ రావడంతో ఇరుగు పొరుగు వారి సమాచారంతో ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. సుమారు రూ.50వేల విలువైన వస్తువులు దగ్ధం అయినట్టు ప్రాథమికంగా అంచనా వేశారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరస్వామి

మురళీనగర్: కప్పరాడ ఎన్జీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్ తెలిపారు. 7.30గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థ ప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30గంటలకు రాజభోగనివేదన ఉంటుంది. మధ్యాహ్నం భక్తులకు అన్నసమారాధన చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు నక్షత్ర హారతి, కర్పూర హారతి, కుష్మాండ హారతి, కుంభ హారతి ఇస్తారు.

ఉత్సాహంగా రన్ ఫర్ యూనిటీ



రన్ ఫర్ యూనిటీలో పాల్గొన్న వాల్తేర్ డివిజన్ అధికారులు, సిబ్బంది

తాటిచెట్లపాలెం: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా వాల్తేర్ డివిజన్ పరిధిలో పలు చోట్ల రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా గురువారం డివిజనల్ రైల్వే కార్యాలయం నుంచి రైల్వేస్టేషన్ వరకు, తిరిగి డీఆర్ఎం కార్యాలయం వరకు ఐక్యతా పరుగు నిర్వహించారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి, సీనియర్ డివిజనల్ సేఫ్టీ ఆఫీసర్ సిద్ధార్థ ప్రధాన్‌ల నేతృత్వంలో నిర్వహించిన ఈ పరుగులో వాల్తేర్ డివిజన్‌లోని వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

భక్తులకు అన్నసమారాధన



అన్నదానం చేస్తున్న కర్రి మురళీకృష్ణారెడ్డి

సీతమ్మధార : స్థానిక 24వ వార్డు రేసపువానిపాలెం వద్ద గల శ్రీ శాంతిస్వరూపిణీ దుర్గా అమ్మవారి ఆలయ ఆవరణలో కేఎస్ఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరుపేదలు, అయ్యప్ప స్వామి మాలధారులకు అన్నదానం చేశారు. ట్రస్టు అధ్యక్షుడు కర్రి మురళీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ఆయన మాట్లాడుతూ ట్రస్ట్ ఆధ్వర్యంలో 13 వారాలుగా ప్రతి శుక్రవారం ఇక్కడ 108 మందికి అన్నదానం చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కె.సత్యనారాయణరెడ్డి, కె.సీతయ్యమ్మపాల్గొన్నారు.

శివ పూజకు వేళాయె..

పవిత్ర కార్తీక మాసంలో విశేష పూజలకు శివాలయాలు ముస్తాబయ్యాయి. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని నిర్వాహకులు ఆలయ ప్రాంగణాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. కార్తీకమాసంలో భక్తులు శివపార్వతులకు ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయాలన్నీ శివ నామస్మరణతో మార్మోగుతాయి. ఈ మాసంలో శివాలయంలో దీపం వెలిగిస్తే జన్మజన్మల పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం.

- ముస్తాబైన శైవక్షేత్రాలు
- నేటి నుంచి కార్తీక మాసం ఆరంభం



రామలింగేశ్వరాలయంలో విశాలమైన మండపం

సీతంపేట: శివునికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీ మాసం శనివారం నుంచి ఆరంభం కానుంది. డిసెంబరు 01 వరకు కార్తీకమాసం కొనసాగుతుంది. కార్తీకమాసంలోని నాలుగు సోమవారాలు, పౌర్ణమి, ద్వాదశి, పాఢ్యమి వంటి ముఖ్యమైన రోజుల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

పార్వతీశ్వరాలయం విశిష్టత

సీతంపేట గణేష్‌నగర్‌లో 1991లో పార్వతీశ్వరుల విగ్రహాలను గ్రామస్తులు ప్రతిష్ఠించారు. నాటి నుంచి నేటి వరకు నిత్య పూజలు,పండగలు,పర్వదినాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. ఆలయంలో ప్రదక్షిణ భాగంలో పంచభూత శివలింగాలు, ద్వాదశ జ్యోతిర్లింగాలను ఏర్పాటు చేశారు. ప్రముఖ శివ క్షేత్రాలను దర్శించిన అనుభూతి కలిగేలా ఆలయ అర్చకులు గంగవరపు శివాజీశర్మ దాతల సహాయంతో ఆలయాన్ని తీర్చిదిద్దారు. ఆలయ ప్రవేశద్వారం వద్ద 12 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. వినాయకుడు, పార్వతీదేవి, సుబ్రహ్మణ్యస్వామి, సీతారాములు, నవగ్రహాలు, కాలభైరవుడు,నాగబంధనం, మహిళలు ఎంతో భక్తితో పూజించే రావి వేప బంధనాల చెట్టు, ఉసిరి, జమ్మి, మారేడు, కదంబ చెట్లు ఆలయ ఆవరణలో ఉన్నాయి. కార్తీక మాసంలో ప్రతి రోజూ రుద్రహోమం, సాయంత్రం మేళతాళాలతో ఆకాశదీపం, ఏక హారతి, కుంభహారతి, పంచహారతి, నక్షత్ర హారతి కార్యక్రమాలు జరుగుతాయని అర్చకులు భాస్కరశర్మ తెలిపారు.

పూజలకు ఏర్పాట్లు

25వ వార్డు సీతంపేట, గణేష్‌నగర్‌లోని పార్వతీశ్వరాలయం, 26వ వార్డు శంకరమఠం రోడ్, రామకృష్ణానగర్‌లోని రామలింగేశ్వరాలయాల్లో శనివారం తెల్లవారుజాము నుంచి కార్తీక మాస ప్రత్యేక పూజలు ప్రారంభించనున్నట్టు ఆలయ ఈవో జి.వి.రమాబాయి తెలిపారు. రూ.250 రుసుముతో భక్తుల గోత్రనామాలతో నాలుగు సోమవారాలు పూజలు, నెలంతా నిత్యపూజకు రూ.150 చెల్లిస్తే భక్తుల గోత్రనామాలతో జలాభిషేకం చేయనున్నట్టు ఈవో తెలిపారు.

కార్తీకమాసంలో ముఖ్యమైన రోజులు...

02-11-2024	కార్తీకమాసం ప్రారంభం
04-11-2024	మొదటి సోమవారం
05-11-2024	నాగుల చవితి
11-11-2024	రెండవ సోమవారం
12-11-2024	ఏకాదశి
13-11-2024	క్షీరాబ్ధి ద్వాదశి
15-11-2024	కార్తీక పౌర్ణమి, జ్వాలా తోరణం
18-11-2024	మూడో సోమవారం
25-11-2024	నాలుగో సోమవారం
26-11-2024	కార్తీక బహుళ ఏకాదశి
29-11-2024	మాస శివరాత్రి
01-12-2024	కార్తీక అమవాస్య
02-12-2024	పోలి స్వర్గం, మార్గశిర మాసం ప్రారంభం



విద్యుత్‌దీపాలంకరణలో ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయం

ఆలయాలు ముస్తాబు

సీతమ్మధార: కార్తీకమాసం సందర్భంగా నక్కవానిపాలెంలోని ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం తొలిరోజు శనివారం ఘనంగా పూజలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. కార్యనిర్వహణాధికారి ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో సకల సదుపాయాలు కల్పించారు. నెలరోజుల నిత్య పూజలకు రుసుం రూ.300 చెల్లించాల్సి ఉంటుందన్నారు.

విశిష్ట దేవాలయం రామలింగేశ్వరాలయం

శంకరమఠం రోడ్‌లోని రామలింగేశ్వరాలయం ఎంతో విశిష్ట దేవాలయంగా పేరుగాంచింది. 1971లో గ్రామస్తులు ఆలయంలో శివలింగాన్ని ప్రతిష్ఠించారు. భక్తులు దీపాలు వెలిగించేందుకు, దీప, సాలిగ్రామ దానాలు ఇచ్చేందుకు వీలుగా విశాల మండపం, నవగ్రహాలు, నాగబంధనం, రావిచెట్టు, జమ్మి చెట్టు, ఉసిరి చెట్టు ఆలయంలో కొలువుతీరాయి. ప్రతి రోజూ ఉదయం 5 గంటల నుంచే అభిషేకాలు, అర్చనలు, దీపారాధనకు వీలుకల్పిస్తున్నారు. కార్తీక మాసం నెల రోజులు ప్రతి రోజు సాయంత్రం 6:30 గంటల నుంచి 8:30 వరకు కె.వేణుమాధవ్ భాగవతార్‌చే హరికథా కాలక్షేపం ఏర్పాటు చేసినట్లు ఈవో రమాబాయి తెలిపారు. గోత్రనామాలతో నాలుగు సోమవారాలు అభిషేకానికి రూ.250లు, నెలంతా నిత్యపూజకు రూ.300లు చెల్లించాల్సి ఉంటుందని ఈవో తెలిపారు.

నార్త్ ఎక్స్‌టెన్షన్‌లో...



పూజలు అందుకోనున్న పార్వతీశుడు

నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శివాలయంలో కార్తీక పూజలకు అన్ని ఏర్పాట్లు చేశారు. కార్తీక మాసంలో భక్తులు తెల్లవారుజామునే చన్నీటి స్నానాలు ఆచరిస్తారు. దేవలయాల్లో దీపారాధన, శివారాధనలో భక్తులు పరవశిస్తారు. సోమవారాల్లో తెల్లవారు జాము నుంచే పెద్ద సంఖ్యలో భక్తులు శివాలయాల్లో పూజలు నిర్వహించడం పరిపాటి.

శ్రీలలితా పీఠంలో....

కార్తీమాసం సందర్భంగా అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠంలో ప్రతి రోజూ ఉదయం 6 గంటలకు మణిద్వీపంలో విజయగణపతి, కామేశ్వరులకు సామూహిక ఏకవార అభిషేకాలు జరుగుతాయని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. అలాగే ప్రతి రోజూ సాయంత్రం 5:30 గంటలకు కాళీ కాలభైరవులకు ఏకవార అభిషేకం, విశేష హారతులు ఇవ్వబడునని, కార్తీక సోమవారాలలో ఉదయం 8 గంటలకు మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం జరుగుతుందని, ప్రతి రోజూ ఉదయం 7:30 గంటలకు గోత్రనామాలతో చండీపారాయణ జరుగుతుందని తెలిపారు.

డ్రైడే తో దోమల నివారణ



శాంతిపురంలో సిబ్బందికి సూచనలిస్తున్న జిల్లా మలేరియా అధికారి తులసీరాజ్

సీతంపేట: ప్రతి శుక్రవారం, మంగళవారం డ్రైడే పాటిస్తే దోమల ఉత్పత్తిని నివారించగలమని జిల్లా మలేరియా అధికారి ఎం.తులసీరాజ్ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 25వ వార్డులో శాంతిపురంలో పర్యటించారు. దీనిలో భాగంగా ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వలను గుర్తించి వాటి జీవీఎంసీ యాంటీ లార్వా ఆపరేషన్ సిబ్బందితో కలిసి తొలగించాలన్నారు. అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఇంటి పరిసరాల పరిశుభ్రతతోపాటు, నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించుకోవాలని సూచించారు. ఇంట్లో వాడకం నీరు ఎప్పటికప్పుడు కాలువలోకి వెళ్లేలా శుభ్రం చేసుకోవాలన్నారు. దోమకాటు ద్వారా మలేరియా, డెంగ్యూ జ్వరాలు వ్యాప్తి చెందుతాయని, వాటి రక్షణకు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ అధికారి నగేష్ పట్నాయక్, శేషుబాబు, జీవీఎంసీ మలేరియా సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బాలోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

డాబాగార్డెన్స్: ఈ నెల 19 నుంచి 21వరకు నిర్వహించనున్న విశాఖ బాలోత్సవం పోస్టర్‌ను జీవీఎంసీ కమిషనర్ సంపత్‌కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశాఖ బాలోత్సం నిర్వాహక ప్రధాన కార్యదర్శి జీఎస్ రాజేశ్వరరావు మాట్లాడుతూ మూడు రోజుల పాటు విశాఖ బాలోత్సవం స్థానిక సెయింట్ ఆంథోనీ ప్రైమరీ పాఠశాలలో నిర్వహిస్తున్నామని, ఇప్పటికే స్కూళ్లకు వెళ్లి పోటీల వివరాల సెట్లు అందజేశామన్నారు. ఈ నెల 9లోగా బాలోత్సవ కేంద్రంలో ఎంట్రీలు అందజేయాలని స్కూళ్ల యాజమాన్యాలను కోరినట్టు తెలిపారు. బాలోత్సవం విజయవంతం చేసేందుకు జీవీఎంసీ కమిషనర్ సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

పోర్టులో ఘనంగా ఏక్తా దివస్ వేడుకలు



పోర్టులో ఏక్తా దివస్ వేడుకల్లో పాల్గొన్న పోర్టు అధికారులు, సిబ్బంది

విశాఖ సిటీ: భారతరత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా విశాఖ పోర్ట్ అథారిటీ ఆధ్వర్యంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఏకతా దినోత్సవం) వేడుకలను ఘనంగా నిర్వహించారు. పోర్టు సాంబమూర్తి ఆడిటోరియంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో పోర్టులు, నౌకాశ్రయాలు, నీటి మార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ వర్చువల్‌గా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పోర్టు డిప్యూటీ చైర్‌పర్సన్ దుర్గేష్‌కుమార్ దూబే, ఇతర అధికారులు పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఏక్తా ప్రమాణం చేయించారు.

పోర్టు హాస్పిటల్‌ను యాజమాన్యమే నిర్వహించాలి

- సీఐటీయూ కార్యదర్శి జగన్



దీక్షలో పాల్గొన్న సీఐటీయూ నాయకులు

తాటిచెట్లపాలెం: పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని యాజమాన్యం వెంటనే విరమించుకోవాలని యునైటెడ్ పోర్టు అండ్ డాక్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) కార్యదర్శి బి. జగన్ డిమాండ్ చేశారు. పోర్టు హాస్పటల్ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా హాస్పటల్ వద్ద జరుగుతున్న రిలే నిరాహారదీక్షలు 31వ రోజుకు చేరాయి. ఈ సందర్భం జగన్ మాట్లాడుతూ పోర్టు హాస్పటల్‌ను రూ.222.43కోట్లతో పీపీపీ పద్ధతిలో సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌గా మార్చాలనే కేంద్ర మంత్రి సర్బానంద సోనోవాల్ ప్రతిపాదనను విరమించుకుని, పోర్టు అథారిటీ సొంత నిధులతోనే హాస్పటల్‌ను నిర్వహించాలని కోరారు. ఈ ప్రతిపాదన లోక్‌సభలో చేసిన నాటి నుంచి ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. ప్రైవేటు వారు వస్తే లోపలికి అడుగుపెట్టబోనివ్వమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి. లక్ష్మణరావు, కె. సత్యనారాయణ, సీహెచ్ త్రినాథరావు, కేఎస్ కుమార్, శంకర్రావు, గణేష్, రాము, నరసింహమూర్తి పాల్గొన్నారు.

'గంగకు నష్టపరిహారం చెల్లించాలి'

సీతమ్మధార : మహిళల రక్షణ కోసం పటిష్టమైన చర్యలను చేపట్టాల్సిన పోలీసులే గంగ అనే మహిళపై అమానుషంగా ప్రవర్తించడం దారుణమని ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు బి. పద్మ, వై.సత్యవతి పేర్కొన్నారు. చిత్రహింసలు పెట్టి, స్టేషన్‌లోనే కాలు విరగ్గొట్టిన ఘటనపై మానవ హక్కుల కమిషన్, హోం మంత్రి అనిత స్పందించాలని ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనను ఐద్వా విశాఖ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండిస్తోందని, తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలని కోరారు. సీతమ్మధారలోని ఆక్సిజన్ టవర్స్‌లో పని చేసుకుని జీవించే గంగ నల్లపూసలు దొంగతనం చేసిందని ఆ ఇంటి యజమాని ఎంవీపీ క్రైం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఆమెను స్టేషన్‌కు తీసుకువెళ్లి లాఠీతో కొట్టడంతో ఎడమ కాలు విరిగిపోయిందని పేర్కొన్నారు. ఎస్ఐ జగదీష్, ఇద్దరు మహిళా కానిస్టేబుళ్లు ఆమెను విపరీతంగా కొట్టారని తెలిపారు. ఈ ఘటనపై పోలీస్ విచారణ జరపకుండా అభాగ్యురాలిపై పోలీసులు దాష్టీకం చేయడం సరికాదన్నారు. విశాఖలో పోలీస్ రాజ్యం నడుస్తోందని ఆరోపించారు. హోం మంత్రి అనిత జోక్యం చేసుకొని ఆ పోలీసులను తక్షణమే సస్పెండ్ చేయాలని, గంగకు ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. తప్పుడు కేసు పెట్టిన ఇంటి యజమానురాలు ప్రియాంకపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వం ఇంటిపనివారల రక్షణకు ప్రత్యేకమైన చట్టం తీసుకురావాలని ఐద్వా డిమాండ్ చేస్తోందని పేర్కొన్నారు.

పింఛన్‌దారుల నిరీక్షణ

- సర్వర్ మొరాయింపుతో తప్పని అవస్థలు



కంచరపాలెం జాతీయ రహదారి సబ్‌వేలో గట్లపై పింఛన్ కోసం నిరీక్షిస్తున్న వృద్ధులు

కంచరపాలెం: సామాజిక పింఛన్ల పంపిణీలో సర్వర్లు మొరాయించడంతో జోన్-5 పరిధిలో లబ్ధిదారులకు నిరీక్షణ తప్పలేదు. పింఛన్ల పంపిణీ కోసం లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లిన సచివాలయ సిబ్బంది సర్వర్లు పని చేయకపోవడంతో, వారిని సచివాలయాల వద్దకు రమ్మని పిలిచారు. అక్కడ కూడా సరిగ్గా పనిచేయకపోవడంతో సుమారు గంట సమయం వేచి ఉండాల్సి వచ్చింది. మరికొన్ని ప్రాంతాల్లో ప్రతి నెలా మాదిరిగానే లబ్ధిదారులను ఒకచోట చేర్చి పంపిణీ చేస్తున్నారని పలువురు అవేదన వ్యక్తం చేస్తున్నారు. సాయంత్రం వరకు సక్రమంగా పని చేయని సర్వర్లతో సిబ్బంది విసుగు చెందారు. పింఛన్ల కోసం లబ్ధిదారులు కంచరపాలెం జాతీయ రహదారిలో సబ్‌వే దిమ్మెలపై కూర్చొని నిరీక్షించారు. జోన్-5 పరిధిలో 24వార్డులకు సంబంధించి టీపీఆర్‌వో ఏపీడీ, సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీల ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేసినట్లు జెడ్సీ బి.రాము తెలిపారు. మొత్తం 31,876 మందికి గాను 29,400 మందికి పింఛన్ అందజేశారన్నారు. సుమారు 92.18 శాతం పింఛన్ల పంపిణీ పూర్తయిందన్నారు. శనివారం నాటికి 100 శాతం పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీవోలు పుణ్యవతి, కృపానందం, జోనల్ సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టాఫీసు పునరుద్ధరణకు వినతి



ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజుకు వినతి పత్రం అందిస్తున్న సనపల వరప్రసాద్, పీవీఎస్ రాజు

మురళీనగర్: మురళీనగర్‌లో పోస్టాఫీసును పునరుద్ధరించాలని కోరుతూ మురళీనగర్ రెసిడెంట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సనపల వరప్రసాద్, వైశాఖి స్పోర్ట్స్ పార్కు కార్యదర్శి పీవీఎస్ఎన్ రాజు శుక్రవారం ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజును కలిసి వినతి పత్రం అందించారు. పోస్ట్ ఆఫీస్‌లో సుమారు 4000 మంది ఖాతాలు తెరిచారని, కోట్ల రూపాయల వరకు డిపాజిట్లు కలిగి ఉన్నారని వివరించారు. పోస్ట్ ఆఫీస్ తరలింపుతో 50 వార్డు పరిసర ప్రాంతాల వృద్ధులు, దివ్యాంగులు జాతీయ రహదారి దాటి వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యేకు వారు వివరించారు. పోస్టల్ అధికారులతో మాట్లాడి పోస్ట్ ఆఫీస్ పునరుద్ధరించాలని వారు కోరారు.

సందడిగా దీపావళి



దీపాలు వెలిగిస్తున్న కుటుంబ సభ్యులు

సీతమ్మధార: దీపావళి పర్వదినాన్ని నియోజకవర్గ ప్రజలు గురువారం ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు కొత్త దుస్తులు ధరించి పండగ చేసుకున్నారు. సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నక్కవానిపాలెం, రాధాకృష్ణ లే అవుట్, గాంధీనగర్, పి అండ్ టీ కాలనీ, టీపీటీ కాలనీ తదితర ప్రాంతాల్లో దీపావళి వేడుకలు ఘనంగా జరిగాయి. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్ ప్రాంతంలో ఉంటున్న ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు కుమార్తె శ్యామలాదీపిక, అల్లుడు సునీల్ అగర్వాల్, పిల్లలతో కలిసి దీపావళి పర్వదినాన్ని వేడుకగా నిర్వహించారు.

అమావాస్య పూజలు

దీపావళి అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. మహిళలు దేవాలయాల్లో గుమ్మడిముక్కల్లో నేతిదీపాలు వెలిగించి కాలభైరవ స్వామికి పూజలు చేశారు. సీతమ్మధార నార్త్ ఎక్స్‌టెన్షన్‌లోని శ్రీ మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర స్వామి అయ్యప్ప స్వామి, షిర్డీసాయిబాబా ఆలయంలో గల కాలభైరవ స్వామికి పూజలు చేశారు.



వానప్రస్థ వృద్ధాశ్రమంలో దీపావళి వేడుకలు

వానప్రస్థ వృద్ధాశ్రమంలో..

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో దీపావళి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వృద్ధులు దీపావళిని ఉత్సాహంగా జరుపుకున్నారు. మానవ సేవే మాధవ సేవ ఆధ్వర్యంలో సభ్యులు ప్రహ్లాదపురంలోని మనసు బాలిక అనాథాశ్రమాన్ని సందర్శించారు. వీరు దీపావళి సామగ్రి, పండ్లు అందించారు. కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు డి.ప్రసాదరాజు, వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, అధ్యక్షుడు ఎస్.సీతారామకృష్ణ, ఉపాధ్యక్షులు డి.వరప్రసా, పి.గిరిధర్, కార్యదర్శి వై.తిరుమూర్తి, కోశాధికారి కేవీ వర్మ తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు ఉద్యమిద్దాం



ఐక్యత చాటుతున్న పలు సంఘాల నాయకులు

డాబాగార్డెన్స్: విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధనకు అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జే నాయుడు అధ్యక్షతన శుక్రవారం రాష్ట్ర విద్యార్థి కన్వెన్షన్ నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ద్రవిడ యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ కేఎస్ చలం, డాక్టర్ కొల్లా రాజమోహన్, స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్ సీహెచ్ నరసింగరావు పాల్గొని మాట్లాడారు. 1966 నవంబర్ ఒకటిన విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదంతో ఉద్యమం ఉవ్వెత్తున సాగిందన్నారు. 32 మంది విద్యార్థులు, యువకుల బలిదానంతో విశాఖ స్టీల్‌ప్లాంట్ సాధించుకున్నామన్నారు. బంగారు బాతులాంటి విశాఖ స్టీల్‌ను ప్రైవేట్‌పరం చేయడానికి కేంద్ర బీజేపీ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందని, దక్షిణ కొరియా పోస్కో కంపెనీతో ఒప్పందం చేసిందని తెలిపారు. విశాఖ స్టీల్‌ను సెయిల్‌లో ఎందుకు విలీనం చేయడం లేదని ప్రశ్నించారు. విశాఖ స్టీల్‌కు సొంత గనులు కేటాయించడమే శాశ్వత పరిష్కారమని పేర్కొన్నారు. విద్యార్థి, యువజన సంఘాల నాయకులు ఎ. అశోక్ (ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి), రామన్న (డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి), భాను (పీడీఎస్‌వో), హరీష్‌కుమార్ (ఏఐడీఎస్‌వో) మాట్లాడుతూ అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని విద్యార్థులు, తెలుగు ప్రజలంతా పోరాడి విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సాధించుకున్నారని, నేడు పోరాడి స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవల్సిన దుస్థితి వచ్చిందన్నారు. నెల రోజుల్లో విశాఖ స్టీల్ శతశాతం అమ్మకం నిర్ణయాన్ని విరమించుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థి, యువత ఆందోళన తప్పదని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రసన్నకుమార్, రాము, యూఎస్ఎన్ రాజు, సంతోష్, పల్లవి, సౌమ్య, రామ్మోహన్, నాగరాజు, అభిలాష్, విశ్వనాథం, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆళ్వార్‌దాస్ సేవలు చిరస్మరణీయం



యోగాసనాలు వేస్తున్న వాకర్స్ క్లబ్‌సభ్యులు

మురళీనగర్: వాకర్స్ ఇంటర్నేషనల్ వ్యవస్థాపకుడు సుంకరి ఆళ్వార్‌దాసు వాకర్స్ ఉద్యమానికి చేసిన సేవలు చిరస్మరణీయమని మురళీనగర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అన్నారు. ఆళ్వార్‌దాస్ జయంతిని వాకర్స్ పార్కులో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆళ్వార్‌దాస్ ఎంతో ముందుచూపుతో ప్రారంభించిన వాకర్స్ ఉద్యమం నేడు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిందన్నారు. నేడు ప్రతి వ్యక్తి నడక ద్వారా తమ ఆరోగ్యాన్ని కాపాడుకోగలుగుతున్నారని చెప్పారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో పూర్వాధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, పెంటకోట శ్రీనివాసరావు, ఆశపు నూకరా, చల్లకొండ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కేజీహెచ్‌లో అరుదైన శస్త్ర చికిత్స



రోగితో కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద తదితరులు

మహారాణిపేట: కేజీహెచ్‌లో మహిళకు అరుదైన శస్త్ర చికిత్స చేశారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ప్రేమ జీత్ రే ఆధ్వర్యంలో వైద్యులు చికిత్స చేయడంతో రోగి సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద తెలిపారు. విశాఖకు చెందిన 42 సంవత్సరాల పి.లక్ష్మి అనే మహిళ తలనొప్పి, వాంతులతో బాధపడుతూ గత నెల 14న కేజీహెచ్ న్యూరో ఓపీలో చూపించుకుంది. ప్రాథమిక పరీక్షలు చేసి న్యూరో సర్జరీ వార్డులో చేర్చారు. ఆమెకు ట్యూమర్ ఉన్నట్లు తేలింది. గతంలో కూడా ఈమెకు ఇదే సమస్య రావడంతో 2021లో కేజీహెచ్‌లో ఆపరేషన్ చేశారు. అయితే అప్పుడు కొంత భాగమే తొలగించారు. ఈ ట్యూమర్ పెరిగి ఇప్పుడు పెద్దదై బ్రెయిన్‌లో 3వ వంతు పెరిగింది. గత నెల 22న శస్త్ర చికిత్స చేసి ట్యూమర్‌ను పూర్తిగా తొలగించారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ఎం.ప్రేమ జీత్ రే ఆధ్వర్యంలో ఎనస్తీషియా విభాగాధిపతి డాక్టర్ వాసుపల్లి రవి పర్యవేక్షణలో 8 గంటల పాటు శస్త్ర చికిత్స చేసి పూర్తిగా తొలగించారు. శుక్రవారం రోగిని సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద పరామర్శించారు.